## క్లుప్తంగా

### బీజేవైఎం అసెంబ్లీ కన్వీనర్‌కు సన్మానం

**తలకొండపల్లి:** బీజేవైఎం అసెంబ్లీ కన్వీనర్‌గా నియమితులైన అనిల్‌ను సన్మానించారు. తలకొండపల్లి మండల కేంద్రానికి చెందిన అనిల్ బీజేవైఎం కల్వకుర్తి అసెంబ్లీ కన్వీనర్‌గా రెండోసారి నియమితులయ్యారు. ఈ సందర్భంగా గురువారం బీజేవైఎం, బీజేపీ నాయకులు తలకొండపల్లిలో శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో సాయిరాం, గణేషు, రాజు, సుధాకర్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

### నర్సరీల్లో మొక్కల సంరక్షణ తప్పనిసరి

ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి



తక్కళ్లపల్లి గ్రామ పంచాయతీలో రికార్డులను తనిఖీ చేస్తున్న నరేందర్‌రెడ్డి

**యాచారం:** వేసవి కాలం దృష్ట్యా నర్సరీల్లో తప్పనిసరిగా మొక్కలను సంరక్షించాలని ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని తక్కళ్లపల్లి, తక్కళ్లపల్లితండా, నక్కర్తమేడిపల్లి తదితర గ్రామాల్లోని నర్సరీల్లో గురువారం మొక్కలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సరీల్లో పెంచుతున్న మొక్కలకు క్రమం తప్పకుండా నీళ్లు పట్టించాలని సిబ్బందికి సూచించారు. వర్షాలు కురిసే లోపు అన్ని గ్రామాల్లో గుంతలు తీసి సిద్ధం చేయాలన్నారు. అనంతరం ఆయా గ్రామాల్లోని పంచాయతీలను సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు.

### రోడ్‌షోకు తరలిన బీఆర్‌ఎస్ శ్రేణులు



బొంగ్లూర్ ఔటర్ వద్ద రోడ్డుషోకు బయలుదేరుతున్న బీఆర్‌ఎస్ శ్రేణులు

**ఇబ్రహీంపట్నం రూరల్:** భువనగిరి లోక్‌సభ అభ్యర్థి క్యామ మల్లేశ్ ప్రచారంలో భాగంగా గురువారం బీఆర్‌ఎస్ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ రోడ్డుషోకు ఇబ్రహీంపట్నం నుంచి బీఆర్‌ఎస్ నాయకులు భారీగా తరలివెళ్లారు. ఇబ్రహీంపట్నం యువనేత మంచిరెడ్డి ప్రశాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని ప్రతీ బూత్ నుంచి 20 మంది చొప్పున 5,000 మంది కార్యకర్తలు, నాయకులు తరలివెళ్లారు. బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్‌కు మద్దతుగా ఆదిబట్ల మున్సిపాలిటీ బొంగ్లూర్ ఔటర్ రింగ్‌రోడ్డు వద్ద కాన్వాయ్‌కి మంచిరెడ్డి ప్రశాంత్‌రెడ్డి జెండా ఊపీ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల, మున్సిపాలిటీల పార్టీ అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శులు, రైతు సహకార సంఘం చైర్మన్‌లు, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ అనుబంధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### హనుమాన్ ఆలయంలో సీఐల పూజలు



గౌరారంలో సీఐలను సత్కరించిన భాస్కర్‌రావ్

**ఆమనగల్లు:** ఆకుతోటపల్లి గ్రామ పరిధిలోని గౌరారం గ్రామంలో నూతనంగా ప్రారంభించిన అభయాంజనేయస్వామి ఆలయంలో గురువారం ఆమనగల్లు సీఐ ప్రమోద్‌కుమార్, కడల సీఐ శివప్రసాద్, ఆమనగల్లు ఎస్‌ఐ బాల్‌రాంలు ప్రత్యేక పూజలు చేశారు. కాగా ఆలయంలో మూడు రోజులుగా విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా ప్రమోద్‌కుమార్, శివప్రసాద్, బల్‌రాంను ఆలయ కమిటీ కార్యదర్శి భాస్కర్‌రావ్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. స్థానిక నాయకులు దామోదర్, కృష్ణరావ్, వెంకట్రాములు, అంజన్‌రావ్, శ్రీనివాస్‌రావ్, కొండల్ తదితరులు పాల్గొన్నారు.

### బెల్టుషాపుపై పోలీసుల దాడి

**తలకొండపల్లి:** మండలంలోని జూలపల్లి గ్రామంలో కిరాణాషాపుతో పాటు బెల్ట్‌షాపు నడుపుతున్నారనే పక్కా సమాచారం మేరకు గురువారం తలకొండపల్లి పోలీసులు షాప్‌పై దాడి నిర్వహించారు. దాడిలో 14 బీర్లు లభ్యమయ్యాయి. వాటిని సీజ్ చేయడంతో పాటు షాప్ నిర్వాహకుడు నర్సింహపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీకాంత్ తెలిపారు.

# జోరుగా నీటి దందా!

- ఎక్కడ పడితే అక్కడే ఫిల్టర్ చేయడం
- అధికారుల పర్యవేక్షణ కరువు
- 20 లీటర్ల డబ్బాకు రూ.35
- తాగునీటికి డిమాండ్
- ఇబ్బందుల్లో ప్రజలు

**ఇబ్రహీంపట్నం రూరల్:** అసలే ఎండకాలం. రోజురోజుకు భానుడు విజృంభిస్తున్నాడు. ప్రతిరోజు పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో పాటు ఉక్కపోత ఎక్కువవుతుంది. దీంతో నీటి అవసరాలు పెరుగుతున్నాయి. ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో అత్యధికంగా జనాభా ఉంది. నియోజకవర్గం హెడ్‌క్వార్టర్ కావడంతో రోజురోజుకు పెరుగుతున్న జనాభావసరాల కనుగుణంగా నీరు లేకుండా పోతుంది. ఇబ్రహీంపట్నం పెద్ద చెరువులో నీరున్నప్పటికీ వాడుకోలేని దుస్థితి నెలకొంది.

**తప్పని ఇబ్బందులు...**

ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో తాగునీటి కోసం తండ్లాట తప్పడం లేదు. ఎంబీఆర్‌నగర్, బృందావన్ కాలనీ, వెంకటరమణాకాలనీ, అంబేడ్కర్ నగర్‌తో పాటు కొత్తగా వెలుస్తున్న కాలనీల్లో నీటి సమస్య విపరీతంగా ఉంది. ఇదే అదునుగా చేసుకొని వాటర్ ఫిల్టర్లు అడ్డగోలుగా వెలుస్తున్నాయి. వీటిపై నియంత్రణ లేకపోవడంతో పట్టించుకునే వారు లేరు. దీంతో విచ్చల విడిగా వాటర్ ఫిల్టర్లు పెరిగిపోతున్నాయి. ఆటోలో నీటిని తీసుకెళ్లి 20 లీటర్ల డబ్బాకు రూ.35 వరకు విక్రయిస్తున్నారు. ఒక్క ఇబ్రహీంపట్నంలోనే గల్లీగల్లీకి వాటర్ ఫిల్టర్లు పెట్టి జలదోపిడీ చేస్తున్నారు. మున్సిపాలిటీ అధికారులు కనీసం వాటిపై చర్యలు తీసుకోవడం లేదు. రోజుకు లక్షల లీటర్లలో నీటిని విక్రయించి లాభాలు ఘడిస్తున్నారు.

**ట్యాంకర్లతో నిలువు దోపిడీ..**

ఇబ్రహీంపట్నంలోని ఎంబీఆర్‌నగర్, బృందవన్ కాలనీల్లో వందలాది నివాసాలు నిర్మించారు. పెద్దపెద్ద అపార్ట్‌మెంట్‌లు సైతం ఇక్కడే ఉన్నాయి. వేసవి కాలం కావడంతో బోర్లు పూర్తిగా ఎండిపోయాయి. ప్రజలకు ప్రత్యన్మయంగా వాటర్ ట్యాంకర్లే గతయ్యాయి. కాబట్టి వీటిని ఇబ్బడిముబ్బడిగా కొనుగోలు చేయాల్సి వస్తుంది. కనీసం రోజుకు ఒక్క ఇంటికి తప్పనిసరిగా ట్యాంకర్ నీటిని పోయించుకోవాల్సిన దుస్థితి నెలకొంది.

దీంతో అవకాశాన్ని బట్టి నీటి విక్రయం జోరందుకుంటుంది. సీజన్లో అవసరాన్ని బట్టి ట్యాంకర్‌కు రూ.1200 నుంచి రూ.800ల వరకు అమ్ముతున్నారు. రోజుకు వందల్లో ట్యాంకర్ల ద్వారా నీటి విక్రయం నిర్వహిస్తున్నారు. నీరు లేకుంటే ఇల్లు గడవని పరిస్థితి ఏర్పడడంతో కొనుగోలు చేయాల్సి వస్తుందని వాపోతున్నారు. మున్సిపాలిటీ నుంచి సరఫరా అయ్యే నీరు సరిగా రాకపోవడం, ఇంట్లో ఉండే బోర్లు ఎండిపోవడంతో ఈ దుస్థితి దాపురించిందని వాపోతున్నారు. వేలాది రూపాయలు తాగునీటికే వెచ్చించాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, ప్రభుత్వం వెంటనే ప్రజల అవసరాలకు అనుగుణంగా నీటిని సరఫరా చేయాలని కోరుతున్నారు.



ఇబ్రహీంపట్నంలో ఓ ఇంటికి ట్యాంకర్‌తో నీటిని పోస్తున్న దృశ్యం



ట్యాంకర్లతో ఇంటింటికీ సరఫరా

### బోరు ఎండిపోయింది



మా ఇంట్లో 1000 అడుగుల లోతువరకూ బోరు వేయించాము. వేసవి కాలం ప్రారంభంలోనే ఎండిపోయింది. చుక్క నీరు రావడం లేదు. ప్రభుత్వం సరఫరా చేసే నల్లా సరిగా రావడం లేదు. కాబట్టి రోజువారి అవసరాలకు తప్పనిస్థితిలో నీటిని కొనుగోలు చేయాల్సి వస్తుంది. నెలకు రూ.7,000లకు పైగా నీటి కోసమే వెచ్చిస్తున్నాం .

– జిట్టా శ్రీనివాస్‌రెడ్డి, ఎంబీఆర్ నగర్

### నల్లా నీరు సరఫరా చేయాలి



గత ప్రభుత్వ హయాంలో ఇచ్చిన మిషన్‌భగీరథ నీటి పైపులైన్లు బా గుండే. కాని ఇప్పుడు సరిపడ నీరు వదలడం లేదు. గతంలో నీటికి కొదవ లేకుండా వచ్చేది. మూడు రోజులకు ఒక సారి నీరు వస్తూండేది. తాగునీటి కోసం కొనుగోలు చేయాల్సిన దుస్థితి వచ్చింది. నీరు లేకుంటే ఇబ్బందులు తప్పవు. అసలే ఎండకాలం ప్రతి రోజు ఒక్కొక్కరు నాలుగు లీటర్లు తాగాల్సి వస్తుంది. దాహం తీరాలంటే నీరు కొని తాగకతప్పదు.

– నీరుడి మంజుల, గృహిణి

### అంగన్‌వాడీ కేంద్రాల్లో గ్రాడ్యుయేషన్ డే

**కడ్తాల్:** మండల కేంద్రంలోని 1, 2, 4వ అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐసీడీఎస్ సిబ్బంది ఆధ్వర్యంలో గురువారం గ్రాడ్యుయేషన్‌డే నిర్వహించారు. ఈ సందర్భంగా మూడు నుంచి ఆరు సంవత్సరాలు గల చిన్నారుల తల్లులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చిన్నారులతో కథలు, పాటలు, శాస్త్రీయ పరిజ్ఞానం, సంభాషణ తదితర కార్యక్రమాలను వారి తల్లి దండ్రుల సమక్షంలో చేయించారు. అనంతరం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శబరి మాట్లాడుతూ ప్రీస్కూల్ పిల్లలను ప్రాథమిక పాఠశాలలో చేర్పడానికి సిద్ధం చేస్తున్నామన్నారు. అంగన్‌వాడీ టీచర్లు ప్రణాళిక ప్రకారం ప్రీస్కూల్ కార్యక్రమాలు నిర్వహిస్తూ, పిల్లల యొక్క స్థితిని బట్టి, వారికి సంవత్సరంలో మూడు సార్లు అభివృద్ధి సూచికలు, శారీరక మానసిక వ్యక్తిగత భావోద్వేగ మేధావికాసం, బడికి సంసిద్ధత వంటి అంశాలను పరిగణలోకి తీసుకుంటామన్నారు. మూడు నుంచి ఆరు సంవత్సరాల చిన్నారులు అంగన్‌వాడీ కేంద్రాలకు రావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు జ్ఞానేశ్వరి, భాగ్యమ్మ, మంగమ్మ, యాదమ్మ, సిబ్బంది చిన్నారులు పాల్గొన్నారు.



పాల్గొన్న చిన్నారులు, ఐసీడీఎస్ సిబ్బంది



ఇబ్రహీంపట్నంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



మాడ్గులలో అవగాహన ర్యాలీ

# మలేరియా నివారణే లక్ష్యం

డిప్యూటీ డీఎంహెచ్‌ఓ ధరణికుమార్

**ఇబ్రహీంపట్నం రూరల్:** దోమలను నివారించడం ద్వారానే మలేరియాను నివారించవచ్చని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ ధరణికుమార్ పేర్కొన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఇబ్రహీంపట్నం ప్రభుత్వ ఆసుపత్రి నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని ఇబ్రహీంపట్నంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో డిప్యూ టీ డీఎంహెచ్‌ఓ ధరణికుమార్ జెండా ఊపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమల నివారణ లక్ష్యంగా ప్రతిఒక్కరూ పని చేయాలని కోరారు. ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించాలని తెలిపారు. పరిసరాలను పరిశుభ్రతను పాటించాలని అప్పుడే దోమల నివారణ తగ్గుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మమత, కీర్తన, గోపాల్‌రెడ్డి, హేమాలాల్, సూపర్‌వైజర్ చంద్రశేఖర్, వయోలాతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

**మాడ్గుల:** మలేరియా నివారణ ప్రతీ ఒక్కరి బాధ్యత అని మాడ్గుల మండల ప్రాథమిక ఆరోగ్యా కేంద్రం డాక్టర్ మోహన్ అన్నారు. బుధవారం మాడ్గుల మండల కేంద్రంలో వైద్య సిబ్బందితో మలేరియా నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మలేరియా నివారణకు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. చలితో కూడిన జ్వరం, తలనొప్పి ఉంటే వెంటనే ఆసుపత్రికి వెళ్లి పరీక్షలు చేయించుకోవాలాన్నారు. దోమలు వృద్ధి చెంద కుండా పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ దయాకర్, ల్యాబ్ టెక్నీషియన్ మనోహర్ రెడ్డి, ఆశ వర్కర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

# మూడో సారి అధికారం ఖాయం

బీజేపీ గిరిజన మోర్చ జిల్లా అధ్యక్షుడు సాయిలాల్‌నాయక్

**కడ్తాల్:** నరేంద్ర మోడీ నాయకత్వంలో కేంద్రంలో మూడో సారి బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు కావడం ఖాయమని, గిరిజన మోర్చ జిల్లా అధ్యక్షుడు సాయిలాల్‌నాయక్ పేర్కొన్నారు. నాగర్‌కర్నూల్ లోక్‌సభ స్థానానికి బీజేపీ అభ్యర్థిగా పి భరత్ గురువారం నామినేషన్ వేయడంతో మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో పార్టీ కార్యకర్తలు, నాయకులు, మహిళలు, యువకులు నామినేషన్ కార్యక్రమంలో పాల్గొనేందుకు నాగర్‌కర్నూల్ తరలివెళ్లారు. ఈ సందర్భంగా సాయిలాల్‌నాయక్ మాట్లాడుతూ నాగర్‌కర్నూల్ పార్లమెంట్ స్థానంలో బీజేపీ అభ్యర్థి ఘన విజయం సాధించడం తథ్యమన్నారు. దేశ అభివృద్ధి కేవలం ప్రధాని మోడీకి సాధ్యమని తెలిపారు. త్వరలో జరిగే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లకు ఓటమి ఖాయమని జోస్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మాన్యనాయక్, రాష్ట్ర అధికార ప్రతినిధి భగీరథ్, నాయకుడు గోపాల్‌రెడ్డి, మల్లేశ్‌నాయక్, మధు, సురేశ్, రవితేజ్, అజిత్ పాల్గొన్నారు.



కడ్తాల్: నామినేషన్‌లో పాల్గొనేందుకు వెలుతున్న బీజేపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు

**కడ్తాల్:** మండల పరిధిలోని గ్రామాల్లో గత కొన్ని సంవత్సరాలుగా గంప లక్ష్మయ్య చారిటబుల్ ట్రస్ట్ ద్వారా, ట్రస్ట్ చైర్మన్ వెంకటేశ్‌గుప్తా అందిస్తున్న సేవలు అభినందనీయమని, జెడ్పీటీసీ జర్పుల దశరథ్‌నాయక్ పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని పాలశీతలీకరణ కేంద్రం ఆవరణలో దివంగత గంప లక్ష్మయ్య వర్ధంతి వేడుకలను ట్రస్ట్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ ఆధ్వర్యంలో స్థానిక ప్రజలకు, ప్రయాణికులకు ఉచిత అన్నదానం నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో, జెడ్పీటీసీ మాట్లాడుతూ, 'గంప లక్ష్మయ్య జ్ఞాపకార్థం' ఆయన కుమారుడు సింగిల్‌విండో చైర్మన్ గంప వెంకటేశ్ గుప్తా ట్రస్ట్‌ను ఏర్పాటు చేసి, గత ఏడెనిమిది సంవత్సరాలుగా, మండల పరిధిలోని పేద ప్రజలకు, విద్యార్థులకు, యువతకు అనేక విధాలుగా అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని, ట్రస్ట్ చైర్మన్‌ను అభినందించారు. ట్రస్ట్ ద్వారా అందిస్తున్న సేవలను మున్ముందు మరింత విస్తృతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ మాజీ గవర్నర్ చెన్నకిషన్‌రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్‌గుప్తా, లయన్స్‌క్లబ్ వాయిస్ గవర్నర్ మహేందర్‌రెడ్డి, లయన్స్ క్లబ్ జోనల్ కార్యదర్శి గోవర్ధన్‌రెడ్డి, బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు వెంకటేశ్, సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటేశ్ చేగూరి తదితరులు పాల్గొన్నారు.



అన్నదానం ప్రారంభించిన దశరథ్‌నాయక్

# కొలతల ప్రకారం పనులు చేయాలి

ఎంపీడీఓ బాలశంకర్

**మంచాల:** గ్రామాల్లో ఎన్‌ఆర్‌ఈజీఎస్ పనులను కొలతల ప్రకారం చేయాలని మంచాల ఎంపీడీఓ బాల శంకర్ పేర్కొన్నారు. గురువారం ఆరుట్ల గ్రామంలో కొనసాగుతున్న ఉపాధిహామీ పథకం పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీలతో మాట్లాడారు. కూలీలు ప్రభుత్వం కల్పించిన నిబంధనలు తప్పకుండా పాటించాలన్నారు. కొలతల ప్రకారం పనులు చేసినప్పుడే దినసరి కూలి పడుతుందన్నారు. ఎండలో పనులు చేసే సమయంలో వడదెబ్బకు గురి గాకుండా నీడలో ఉండే విధంగా చూసుకోవాలన్నారు. గ్రామాల్లో ప్రతి ఉపాధిహామీ కూలీకి పని కల్పించే విధంగా చూడాలన్నారు. ఆరుట్ల గ్రామంలో పారిశుధ్య పనులను పరిశీలించి గ్రామ పంచాయతీ సిబ్బందితో మాట్లాడారన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్ పాల్గొన్నారు.



కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీఓ బాల శంకర్

### ఆధ్యాత్మిక చింతన తప్పనిసరి

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**కొందుర్గు:** ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని ఎమ్మెల్యే శంకర్ పేర్కొన్నారు. గురువారం జిల్లేడ్ చౌదరి గూడ మండలంలోని పద్మారం గ్రామంలో నిర్వహించిన నాభిశిల ప్రతిష్ఠ, వీరన్నపేట గ్రామంలో శివగంగ దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీవితంలో దైవారాధనకు కొంత సమయం కేటాయించాలన్నారు. దైవభక్తితో మానసిక ప్రశాంతత కలుగుతోందని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల కమిటీ అధ్యక్షుడు రాజు, నాయకులు చంద్రశేఖర్, నర్సింలు, రాములు, భాస్కర్, రజిత, ఆంజనేయులు, వెంకట నర్సింహారెడ్డి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

### విద్యకు తొలిమెట్టు అంగన్‌వాడీ కేంద్రం

**కొందుర్గు:** చిన్నారి విద్య ప్రారంభానికి అంగన్‌వాడీ కేంద్రం తొలిమెట్టు లాంటిదని ఐసీడీఎస్ సీడీపీఓ నాగమణి అన్నారు. గురువారం కొందుర్గు మండలంలోని శ్రీరంగాపూర్, సోమారంపహాడ్, మహదేవ్‌పూర్, చిన్నఎల్కిచర్ల, అయోధ్యాపూర్ తండా, జిల్లేడ్ చౌదరిగూడ మండలంలోని పెద్దఎల్కిచర్ల గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలలో వార్షికోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీడీపీఓ నాగమణి హాజరై మాట్లాడారు. మూడేళ్లు నిండిన చిన్నారులను విధిగా అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని కోరారు. అంగన్‌వాడీ నుంచి బడిలో చేర్పించేందుకు సంసిద్ధంగా తయారు చేయడం జరుగుతుందన్నారు. అదే విధంగా గర్భిణీ, బాలింతలకు ప్రభుత్వం అందించే సేవలను వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్యోత్స్న, శివరాణి, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

# నిండా నిర్లక్ష్యం!

- రక్షణ లేని విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు
- ఇబ్బందుల్లో ప్రజలు
- పట్టించుకోని అధికారులు



నానకనగర్‌లో రక్షణ లేని ట్రాన్స్‌ఫార్మర్



తక్కళ్లపల్లి గ్రామ సమీపంలో విద్యుత్ స్తంభానికి అల్లుకున్న కంపచెట్లు, వేర్లు

**యాచారం:** విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం, పర్యవేక్షణ లోపం వల్ల ప్రజల ప్రాణాలకు ప్రమాదం పొంచి ఉంది. విద్యుత్ అధికారులు నిర్లక్ష్యం వల్ల మండల పరిధిలోని పలు గ్రామాల్లో రోడ్ల పక్కన ఉన్న విద్యుత్ స్తంభాల చుట్టు కంపచెట్లతో నిండి, కరెంటు తీగలకు చెట్ల వేర్లు అల్లుకుంటున్నాయి. దీంతో వర్షాలు కురుస్తున్నప్పుడు తరుచూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అదే విధంగా పలు గ్రామాల్లోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు చుట్టూ కంచెలు ఏర్పాటు చేయకపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు తగు చర్యలు తీసుకుని విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లను సరిచేయాలని కోరారు.

# ఎన్నికల ప్రచారాన్ని జయప్రదం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న భాషయ్య

**మంచాల:** మంచాల మండలంలోని లోయపల్లి నుంచి ప్రారంభమయే బీజేపీ ఎంపీ అభ్యర్థి బూర నర్సయ్య గౌడ్ ప్రచార యాత్రను జయప్రదం చేయాలని జిల్లా ఉపాధ్యక్షుడు దన్నె భాషయ్య పిలుపు నిచ్చారు. గురువారం మంచాలలో మండల స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శుక్రవారం ఉదయం 7-00 గంటలకు లోయపల్లి నుంచి బీజేపీ ఎంపీ అభ్యర్థి బూర నర్సయ్య గౌడ్ ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారన్నారు. లోయపల్లి నుంచి ఆంగోత్ తండా, సత్తి తండా, బోడ కొండ, ఎల్లమ్మ తండా, రంగాపూర్, చీదేడ్, దాద్‌పల్లి గ్రామాల మీదుగా ప్రచార యాత్ర సాగుతుందన్నారు. ఈ యాత్రలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ టేకుల రాంరెడ్డి, మండల అధ్యక్షుడు పాండాల జంగయ్య గౌడ్, ప్రధాన కార్యదర్శులు నూకం రాజు, రాజేందర్‌రెడ్డి, ప్రకాశ్, లక్ష్మారెడ్డి, మల్లేశ్, రాజు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

**నేడు బూర నర్సయ్యగౌడ్ రాక**


**యాచారం:** మండల పరిధిలోని పలు గ్రామాల్లో శుక్రవారం భువనగిరి బీజేపీ ఎంపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్ ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారని మండల అధ్యక్షుడు తాండ్ర రవీందర్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఉదయం 10 గంటలకు మొండిగౌరెల్లి నుంచి ఇంటింటి ప్రచారం ప్రారంభమవుతుందని, అనంతరం నల్లవెల్లి, మాల్, తక్కళ్లపల్లి, నక్కర్తమేడిపల్లి, నందివనపర్తి, చింతుల్ల, చౌదర్‌పల్లి గ్రామాల్లో ప్రచారం నిర్వహిస్తారని తెలిపారు. అనంతరం యాచారం మండల కేంద్రంలో ఎన్నికల ప్రచార ముగింపు సభ ఉంటుందని తెలిపారు. దీనికి పెద్ద సంఖ్యలో పార్టీ శ్రేణులు పాల్గొనాలని రవీందర్ విజ్ఞప్తి చేశారు.

# 'విద్యా' కుసుమాలు

**మంచాల:** గ్రామీణ ప్రాంతాల్లో పుట్టి పెరిగిన పేదింటి విద్యా కుసుమాలు వీరు. వారి తల్లిదండ్రుల చదువులు అంతంత మాత్రమే. నిత్యం పని చేసుకుంటే తప్ప పూటగడవని పేద కుటుంబాలు. తమ పిల్లల చదువుల పట్ల వారు చూపిన శ్రద్ధే వారికి మరింత గౌరవం తీసుకొని వచ్చిందని చెప్పాలి. అందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. మంచాల మండలంలోని జాపాల గ్రామానికి చెందిన బకున చంద్రకాంత్– సుకన్య దంపతుల కూతురు సంజన. పిల్లల చదువుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకొని కష్ట పడి ప్రైవేట్ కళాశాలలో చదివించారు. సంజన మొదటి సంవత్సరం ఎంపీసీ ఫలితాల్లో 470 మార్కులకు 468 మార్కులు సాధించి రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచింది. అదే విధంగా మంచాల మండలం చాంద్ ఖాన్ గూడ గ్రామానికి చెందిన మాదం కృష్ణ– సుజాత దంపతుల కుమార్తె మాదం సింధూర ఎంపీసీ ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం ఓ ప్రైవేట కళాశాలలో పూర్తి చేసింది. వ్యవసాయం చేసి పిల్లలను ఎన్ని కష్టాలు వచ్చిన బాగా చదివించారు. ఇంటర్ ఫలితాల్లో సింధూర 1000 మార్కులకు 962 మార్కులు సాధించింది. కష్టపడి చదివి మంచి మార్కులు సాధించిన ఈ పేదింటి విద్య కుసుమాలు నేడు ఎందరికో ఆదర్శంగా నిలిచారు.



బకున సంజన (468/470)



మాదం సింధూర (962/1000)